క్లుప్తంగా

భక్తులతో కిక్కిరిసిన ఆదిశిలా క్షేత్రం

మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. ఈ సందర్భంగా అర్చకులు మధుసూదనచారి, రమేషాచారి, రవిచారి స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదే విధంగా సద్దలోనిపల్లి కృష్ణస్వామి, పాల్వాయి అడవి ఆంజనేయస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, సీతారామిరెడ్డి, రామచంద్రారెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

నర్సరీకి గేట్ ఏర్పాటు



వీపనగండ్ల: మండలంలోని కల్వరాల గ్రామంలోని నర్సరీకి ఇనుప గేటు ఏర్పాటు చేసినట్లు నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి నర్సింహ తెలిపారు. నర్సరీకి గేటు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతుల విజ్ఞప్తి మేరకు అవసరమైన నిధులను సమీకరించి గేటు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

పొగాకు నిర్మూలనకు కృషి



వీపనగండ్ల: సమాజం నుంచి ధూమపానాన్ని పూర్తిగా పారద్రోలేందుకు వైద్య సిబ్బంది తమ వంతు బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రజలను చైతన్యపర్చాలని మండల వైద్యాధికారి డా.రాజశేఖర్ అన్నారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్యకేంద్రంలో ధూమపాన నిర్మూలన కోసం వైద్య సిబ్బందితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



వీపనగండ్ల: మండలంలోని పుల్గర్‌చర్ల గ్రామంలో శనివారం పలువురికి కాంగ్రెస్ నాయకులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. గురుక జగన్‌కు రూ.17,500, బిజ్జ వెంకటేష్‌కు రూ.24 వేలు, కోట్ల సాయిరాముడికు రూ.60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి నర్సింహ, నాయకుడు రఘునాథ్‌రెడ్డి అందజేశారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం



ఖిల్లాఘనపురం: మండలంలో తరుచుగా జరుగుతున్న దొంగతనాలను అరికట్టేందుకు జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి రూ.50వేలు, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్యం రూ.10 వేల విరాళాన్ని ఎస్‌ఐ సురేష్‌గౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వలన నేరాల నివారణ, దొంగతనాలు అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సామ్యానాయక్, ఏఎస్‌ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

కులవివక్ష పాటిస్తే నేరం

మల్దకల్: మండలంలోని కుర్తిరావల్‌చెర్వు గ్రామంలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. అతిథులుగా ఆర్‌ఐ మద్దిలేటి, హెడ్‌కానిస్టేబుల్ గోపాల్‌నాయక్ హాజరై మాట్లాడారు. గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతిని అవలంభించడం, కులవివక్ష పాటించడం చట్టరీత్యా నేరమన్నారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలసి జీవించాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



వానాకాలం సాగుకు సన్నద్ధం



వల్లభాపురంలో జొన్నపంట వేస్తున్న రైతులు

- రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు
- దుక్కులు సిద్ధం చేస్తున్న అన్నదాతలు

వీపనగండ్ల: నైరుతి రుతు పవనాలు ముందస్తుగానే రావడంతో మండలంలో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జూరాల, భీమా కెనాల్ లతో పాటు వివిధ గ్రామాల్లోని చెరువులు, బోరు బావుల కింద పంటలు సాగు చేసేందుకు అన్నదాతలు సిద్ధం అవుతున్నారు. ఇప్పటికే మండలంలోని గ్రామాల్లో వ్యవసాయాధికారులు అవగాహన సదస్సులు నిర్వహించి, విత్తన సేకరణ, యాజమాన్య పద్ధతులు, భూసారం పెంచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

27వేల ఎకరాల్లో సాగు..

మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో 21,344 ఎకరాల్లో వరి, వేరుశనగ, తదితర పంటలు సాగు చేయనుండగా.. 5,683 ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని



డ్రమ్ సీడర్‌తో వరి విత్తనాలు విత్తుతున్న రైతులు(ఫైల్)

అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. 14,793 ఎకరాల్లో వరి, 368 ఎకరాల్లో వేరుశనగ, 131 ఎకరాల్లో మినుములు, 341 ఎకరాల్లో కందులు, 5,683 ఎకరాల్లో మామిడి తోటలను సాగు చేయనున్నారు.

4,212 మెట్రిక్ టన్నుల ఎరువులు

మండలంలో ఈ సీజన్‌లో సాగు చేయనున్న పంటల కోసం 1,464 మెట్రిక్ టన్నులు కాంప్లెక్స్ ఎరువులు, 283 మెట్రిక్ టన్నుల డీఏపీ, 143 మెట్రిక్ టన్నుల పొటాషియం, 181 మెట్రిక్ టన్నుల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 2,141 మెట్రిక్ టన్నుల యూరియా మొత్తం కలిపి 4,212 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అధికారులు గుర్తించారు.

11,541మందికి రైతుభరోసా

మండలంలో 11,541 మందికి రైతు భరోసా పథకం వర్తిస్తుండగా.. అందుకు రూ16.34 కోట్లు నేరుగా ప్రభుత్వం నుంచి రైతుల ఖాతాల్లో జమ అవుతాయని వ్యవసాయాధికారులు తెలిపారు. మండలంలో రైతు బీమా పథకానికి 7,835 మంది అర్హులైన రైతులు ఉన్నారని, వీరిలో ఇప్పటి వరకు 19 మంది మరణించగా.. 17 బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున చెల్లించినట్లు అధికారులు వెల్లడించారు. ఇంకా ఇద్దరికి రైతు బీమా డబ్బులు అందాల్సి ఉందన్నారు.

శాస్త్రీయ పద్ధతులు అనుసరించాలి



మండలంలోని రైతులు మూస పద్ధతిన సాగు చేయకుండా శాస్త్రీయ పద్ధతుల్లో వ్యవసాయాన్ని చేయడం వల్ల అధిక దిగుబడులతో పాటు చీడపీడల బారిన పడకుండా పంటలను కాపాడుకోవచ్చు. ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించి ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయడం వల్ల ఆర్థికంగా నష్టపోతారని, వ్యవసాయాధికారులు సూచించిన ఎరువులు, క్రిమిసంహారక మందులనే వాడాలి. డ్రమ్ సీడర్ పద్ధతిన వరి సాగు చేయడం వల్ల తక్కువ ఖర్చుతో సాగు చేయవచ్చు. కాల్వల ద్వారా అందుతున్న నీరు వృథా కాకుండా రైతులు చూసుకోవాలి.

– దాకేశ్వర్‌గౌడ్, ఏఓ, వీపనగండ్ల

ధాన్యం కాంటా చేయాలని రైతుల రాస్తారోకో

పాన్‌గల్: కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం వెంటనే కాంటా చేయాలని కోరుతూ మండలంలోని కేతేపల్లిలో శనివారం రైతులతో కలిసి బీజేపీ నాయకులు మొలకెత్తిన ధాన్యాన్ని రోడ్డుపై పోసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అన్వేష్, జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శి రమేష్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు రామకృష్ణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు పండించిన ధాన్యం అమ్ముకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి నెల రోజులు కావస్తున్నా కాంటా చేయకపోవడంతో వర్షానికి చాలా మంది రైతుల ధాన్యం తడిసి మొలకెత్తిందని వాపోయారు. ఒక పక్క ధాన్యం కాంటా చేయడంలో జాప్యం, మరోపక్క తాలు, తరుగు పేరుతో రైతులను మోసం చేస్తున్నా అధికారులు, పాలకులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. తరుగును ప్రభుత్వమే భరించి రైతులకు ఏమాత్రం నష్టం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని, ఈ విషయంపై స్పష్టమైన హామీ ఇచ్చే వరకు రాస్తారోకో విరమించేది లేదని రోడ్డుపై బైఠాయించడంతో వనపర్తి, కొల్లాపూర్ రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు



రైతులతో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి

అక్కడికి చేరుకొని బీజేపీ నాయకులు, రైతులకు నచ్చజెప్పినా వారు రాస్తారోకో విరమించలేదు. దీంతో విషయాన్ని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డికి తెలియపర్చడంతో ఆయన గ్రామానికి చేరుకొని బీజేపీ నాయకులు, రైతులతో మాట్లాడారు. హమాలీలు, లారీల కొరతతో ధాన్యం సేకరణలో జాప్యం జరిగింది వాస్తవమేనని, రెండు, మూడు రోజుల్లో సమస్యను పరిష్కరించి కేంద్రాల్లోని ధాన్యం పూర్తిగా సేకరిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సత్యనారాయణ, శేఖర్, రవిచందుగౌడు, కాశన్న, ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ

వనపర్తి రూరల్: శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో శనివారం సబ్సిడీపై జీలుగ విత్తనాలను సింగిల్ విండో చైర్మన్ జగన్నాథంనాయుడు రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూసారం పెంచేందుకు, చౌడు లక్షణాలు తగ్గి భూసారం పెరిగి సూక్ష్మజీవులు వృద్ధి చెందడానికి జీలుగ విత్తనాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. 30 కేజీల బస్తా ధర 50 శాతం సబ్సిడీ పోనూ రైతు రూ.2137.50 చెల్లించాలని సూచించారు. విత్తనాలు కావాల్సిన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు.



రైతులకు జీలుగ విత్తనాలు అందజేస్తున్న విండో చైర్మన్ జగన్నాథంనాయుడు

కార్యక్రమంలో సీఈఓ శివకుమార్, ఏఓ హైమావతి, విండో డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

‘పులిగుట్టపై మైనింగ్ లీజు రద్దు చేయాలి’



ఎంపీ డీకే అరుణకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కొత్తకోట రూరల్: మండలంలోని అమడబాకుల శివారులో గల ‘పులిగుట్ట’ మైనింగ్ తవ్వకాలను ఆపడంతో పాటు మైనింగ్ లీజు రద్దు చేయాలంటూ గ్రామస్తులు శనివారం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎంపీతో మాట్లాడుతూ గ్రామానికి అతి సమీపంలో గల పులిగుట్ట పక్కన మోడల్ స్కూల్ ఉండటంతో పాటు ఎనుకుంట రిజర్వాయర్ ఉందని, గుట్టపై వివిధ రకాల జంతువులు ఉన్నాయన్నారు. అంతే కాకుండా సమీపంలో నివాస గృహాలు సైతం ఉండటంతో మైనింగ్ తవ్వకాలు జరిపితే గ్రామస్తులకు, పాఠశాల విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయని విన్నవించారు. ప్రత్యేక చొరవ తీసుకుని మైనింగ్ తవ్వకాలు వెంటనే ఆపడంతో పాటు మైనింగ్ లీజు రద్దు చేయించాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యను విన్న ఎంపీ డీకే అరుణ సానుకూలంగా స్పందించినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ రాజవర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చీర్ల నర్సింహ, గ్రామ పెద్దలు కృష్ణయ్య, రామన్‌గౌడ్, విక్రమ్‌గౌడ్, ప్రకాష్, నగేష్, కురుమూర్తి తదితరులు ఉన్నారు.

పంటల సాగుపై అవగాహన

మదనాపురం: మండలంలోని దుప్పల్లి, రామన్‌పాడు గ్రామాల్లో శనివారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు వరి, పత్తి, వేరుశనగ, జీలుగ, కందులపై సమగ్ర పంట నిర్వహణపై అవగాహన కల్పించారు. కేవీకే శాస్త్రవేత్త అనిత మట్లాడుతూ మట్టి ఆరోగ్య నిర్వహణలో భాగంగా సంతులిత ఎరువుల వినియోగం, సేంద్రియ పదార్థాల వినియోగం, క్రమం తప్పకుండా మట్టి పరీక్షల విశిష్టత గురించి వివరించారు. రైతుల ఆదాయాన్ని పెంచడంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థల పాత్రను, వాటి ద్వారా సమూహ కృషి, మార్కెటింగ్ ద్వారా ప్రయోజనాలు పొందే విధానం వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త సురేష్, ఏఈఓలు అనిత, సింధు, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ తదితరులు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొమ్మల కత్తిరింపులో మెలకువలు పాటించాలి

వీపనగండ్ల: మామిడి తోటలను సాగు చేస్తున్న రైతులు కొమ్మల కత్తిరింపులో మెలకువలు పాటించాలని మండల ఉద్యానవన శాఖ అధికారి కృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మామిడి తోటలను ఆయన పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మామిడి తోటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడిని సాధించవచ్చన్నారు.

11న వేంకటేశ్వరస్వామి కల్యాణం



అమరచింత: మండల కేంద్రంలోని గణేష్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో జూన్ 11న లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పారుపల్లి చింతన్న, పొబ్బతి వెంకటస్వామి తెలిపారు. ఆలయ నిర్మాణం నుంచి ఇప్పటి వరకు క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం స్వామివారి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కల్యాణ ఏర్పాట్లను తెలియచేసే కరపత్రాలను ఆలయంలో శనివారం ప్రత్యేక పూజల అనంతరం విడుదల చేశారు. పట్టణ ప్రజలు స్వామివారి కల్యాణ వేడుకల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకాంత్, వగ్గు రామలింగం, రమేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కొత్త సూగూరు ఉర్సు



వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని కొత్త సూగూరులో హజరత్ సయ్యద్ ఫకీరుల్లా షాఖాద్రీ దర్గాలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఉర్సు శనివారంతో ముగిసింది. ఉత్సవాలకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు చేరుకొని దర్గాలో ప్రార్థనలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. చివరి రోజు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

లోక్‌అదాలత్‌ను వినియోగించుకోండి

ఆత్మకూర్: స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో ఈ నెల 14న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ నరేందర్ అన్నారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, చీటింగ్, కొట్లాటలు, భూ తగాదాలు, భార్యభర్తల గొడవలు, అక్రమ రవాణా, పేకాట, తదితర కేసులకు సంబంధించి కక్షిదారులు లోక్ అదాలత్‌లో రాజీ కావొచ్చని తెలిపారు.

నకిలీ పత్తి విత్తనాలు అమ్మితే చర్యలు

అమరచింత: రైతులకు నకిలీ పత్తి విత్తనాలు అమ్మితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సురేష్ అన్నారు. మండలంలోని ఈర్లదిన్నెలోని ఫర్టిలైజర్ షాపులను శనివారం ఆకస్మికంగా సందర్శించి, తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ఫర్టిలైజర్ షాపుల్లో వ్యవసాయ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. వర్షాకాల పంటల సాగు సమయం మొదలవ్వడంతో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని ఫర్టిలైజర్ షాపుల యాజమానులను ఆదేశించారు. కాలం చెల్లిన రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు షాపుల్లో కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో రైతులు దళారులను నమ్మి నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ విత్తనాలు రహస్యంగా తీసుకొస్తున్న వారి వివరాలను తమకు తెలియజేయాని, అలాంటి సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.



ఫర్టిలైజర్ షాపులో తనిఖీలు చేస్తున్న పోలీసు అధికారులు

ప్రతిరోజు యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాపై అవగాహన కల్పిస్తున్న శిక్షకుడు శ్రీనునాయక్

గోపాల్‌పేట: ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని దశాబ్ది వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని ఆముదాలకుంటతండాలో యోగా శిక్షకుడు శ్రీనునాయక్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తండాలోని ప్రజలతో యోగా చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు ఆయుష్షు పెరుగుతుందన్నారు. యోగాలో మడ్‌బాత్ చేయడం ద్వారా చర్మ సంబంధిత వ్యాధులు, కొలెస్ట్రాల్ హైపర్ టెన్షన్ తగ్గుతుందని వివరించారు. అనులోమ విలోమ ప్రాణయామం చేయడం ద్వారా సర్వరోగాల నుంచి రక్షణ కలుగుతుందని తెలిపారు. ఆదివారం గొల్లపల్లి, సోమవారం కొంకలపల్లి, మంగళవారం రేవల్లి ఇలా ప్రతిరోజు ఒక్కో గ్రామంలో శిక్షణ ఇస్తున్నామని, ప్రజలంతా యోగా చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది సుమిత్ర, రమాదేవి, ఆశావర్కర్లు మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

అమరులను స్మరించుకోవడం బాధ్యత

వనపర్తిటౌన్: ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడి అమరులైన ఉద్యమకారులను స్మరించుకోవడం అందరి బాధ్యత అని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బి.కృష్ణ అన్నారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు వనపర్తిలో అమరవీరుల స్థూపం లేదని విస్మయం వ్యక్తం చేశారు. ఈ మేరకు వనపర్తిలో అమరవీరుల స్థూపం ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద విగ్రహం పక్క స్థలంలో అమరవీరుల స్థూపం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయాన్ని ఇది వరకే ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోట్ల రవి, పరశురాం తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రధాని మోదీ రైతుల పక్షపాతి

కొత్తకోట: ప్రతి ఏటా పంటలకు మద్దతు ధరను కల్పిస్తూ రైతుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృషి చేస్తున్నారని బీజేపీ నాయకులు కొనియాడారు. ఈ మేరకు శనివారం కొత్తకోట చౌరస్తాలో బీజేపీ నాయకులు మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కిసాన్ మోర్చా అధ్యక్షుడు దాబా శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వనపర్తి శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. బీజేపీ రైతుల పక్షపాతిగా పనిచేస్తుందన్నారు. అదేవిధంగా జిల్లాకు ఐఐటీని మంజూరు చేయించినందుకు పాలమూరు ఎంపీ డీకే అరుణ చిత్రపటానికి కూడా పాలాభిషేకం చేశారు.



ప్రధాని మోదీ, ఎంపీ డీకే అరుణ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

సాంస్కృతిక కళలలో ప్రావీణ్యం సాధించాలి

కొల్లాపూర్: చదువుతో పాటు సాంస్కృతిక కళలలో విద్యార్థులు ప్రావీణ్యం సాధించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని మినీ స్టేడియంలో రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును పరిశీలించారు. పేరిణి, జానపద నృత్యాలు, సంగీతం, చిత్రలేఖనం శిక్షణా శిబిరాలను తిలకించారు. శిక్షణ అంశాల గూర్చి రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజతో చర్చించారు. మినీ స్టేడియంలోని షటిల్ కోర్టును, ఇతర వసతులను, ఆర్‌ఐడీ బాలుర జూనియర్ కళాశాలను ఆయన పరిశీలించారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. టీవీలు, మొబైల్‌ఫోన్లకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు.

సిమెంట్, ఇటుక బట్టీల పరిశీలన

పట్టణం సమీపంలోని సిమెంట్ పెల్లల తయారీ కేంద్రాలను, ఇటుక బట్టీలను కలెక్టర్ సందర్శించారు. పెట్టుబటి, రాబడి అంశాల గూర్చి నిర్వాహకులతో చర్చించారు. తక్కువ ఖర్చుతో సిమెంట్, ఇటుక బట్టీలు ఏర్పాటుచేసుకుంటే మంచి లాభాలు ఉంటాయని, యువత స్వయం ఉపాధి కోసం ఇటువంటి వాటిని ఎంచుకోవాలన్నారు. కలెక్టర్ వెంట అడిషనల్ కలెక్టర్ అమరేందర్, జిల్లా యూత్, స్పోర్ట్స్ అధారిటీ అధికారి సీతారాం నాయక్, ఆర్డీఓ భన్సీలాల్, తహసీల్దార్ విష్ణువర్ధన్‌రావు తదితరులు ఉన్నారు.


ఆస్పత్రి ఆవరణలో కాలం చెల్లిన మందులు

- గడువు ముగియని మందులు కూడా చెత్తలోనే..
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు


ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో ఉన్న సీఎస్‌సీ, పీహెచ్‌పీ ఆస్పత్రుల ఆవరణల్లో ఎక్కడ చూసిన కాలం చెల్లిన మందు బిల్లలు, టానిక్ సీసాలు పారబోశారు. వాటిల్లో కొన్ని గడువు తేదీ ముగియని మందులు కూడా ఉండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. మండల కేంద్రంలోని బస్టాండ్‌కు సమీపంలో ఆస్పత్రులు ఉండటం, పక్కనే ఇళ్లు, దుకాణాలు ఎక్కువగా ఉండటంతో చాలామంది ఆస్పత్రి ఆవరణలోకి వస్తుంటారు. చిన్న పిల్లలు సైతం ఆవరణలో ఆడుతుంటారు. అనారోగ్యం బారిన పడిన రోగులతో పాటు వారి వెంట కుటుంబ సభ్యులు ఆస్పత్రుల దగ్గరకు వస్తుంటారు. ఇలా ఎక్కడ పడితే అక్కడ కాలం చెల్లిన మందులు, టానిక్‌లు, సూదులు పడేస్తుండడంతో చిన్న పిల్లలు వాటితో ఆడుకుంటూ ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మందులు ఇవ్వమంటే రెండు, మూడు మాత్రలు ఇచ్చి పంపిస్తున్న ఆస్పత్రి సిబ్బంది మందులను ఇలా వృథాగా పారబోయడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై సీఎస్‌సీ సూపరింటెండెంట్ పుల్లారెడ్డిని వివరణ కోరగా.. కాలం చెల్లిన మందులను బహిరంగ ప్రదేశాల్లో పారవేయకూడదని, వాటిని కాల్చడం, మందులు, టానిక్‌లు నీటిలో కలిపి పారబోయాలని అన్నారు. గడువు ముగియని మందులను ఎందుకు పారవేసిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు.



సీఎస్‌సీ, పీహెచ్‌సీ ఆస్పత్రుల ఆవరణల్లో పారబోసిన మందులు, ఓఆర్‌ఎస్ పాకెట్లు



సీఎస్‌సీ ఆస్పత్రి సమీపంలో పారబోసిన మందులు



పడేసిన గడువు ముగియని మందులు